
# 'కలసిన సంబంధం'

బొడ్డు బాపిరాజు



౧

నా పేరు సుందరం. వైశ్యులం. వయస్సు 25 సం॥ లు. ఇంటికి యజమాన్ని నేనే. మా యింటి దాని పేరు సరళ. అసలు సరమ్మ. దానికి రూపాంతరం సరళ. ఇరవైయేళ్లుంటాయి. మా మధ్య వొక చంటిపిల్ల మూడేళ్లది. పాడీపంట, సిరీసంపదా, డబ్బూదస్కం యిటువంటి ద్వంద్వాలన్నీ సరిగానే వున్నాయి. ఇక మనం చెప్పుకునే కథకీమాత్రం ఉపోద్ఘాతం చాలు. కొందరి మోస్తరు పుస్తకంకంటే ఉపోద్ఘాతం పెంచి వ్రాయించుకోవడం నాచేత కాను.

సాయంత్రం గం॥ 4 లు అవుతుంది. ఆవేళకూడా రోజూ మోస్తరేవుందిగాని పడమటి కొండమీద సాంధ్యలక్ష్మి కావిరంగు చీర అరవేసుకోనులేదు. అవట్లా వున్నా నా మామూలు కళ్లకు కనుపించవు. నేను కవిని అందులో భావకవిని అసలే కాను. మా డాబా మీద వాలు కుర్చీలో శరీరం చేర్చి యేవో వొకటి రెండు పత్రికలు ముందు వేసుకున్నా కాలక్షేపం ని॥—'ని' రాసి రెండు గీతలు కొడితే నిమిత్తమన్న మాట లెండి! గొప్పకనండి కులాభిమానానికనండి యేమన్నా మీ చిత్తం. 'వాసవి' పత్రిక తెప్పిస్తా. వుబుసుపోకకని ముందే మనవి చేశా. రెండు నెలల క్రిందటి సంచిక నొకదాన్ని తీసి పుటలు తిరగవేస్తున్నా. మా డాబాప్రక్కన వున్న వేపచెట్టు గాలికి పుటలు ముందుకు ముందే వాటంతటవి తిరగబడుతున్నాయి. నా దృష్టి అమాంతంగా వొక పుటలో వెళ్లి వాలింది. పెద్దక్షరాలతో 'వరుడు కావలెను' అని వున్నది. ఆ వరునికి కావలసిన గుణగణాలు వుండవలసిన యీడూ అన్నీ విపులంగా వివరింపబడ్డాయి. అదంతా వోపిగ్గా చదివా. చదివిం తరువాత నాకొక క్రొత్త వూహ కలిగింది. దాన్ని తిరిగి స్మరించుకుంటే నాకే వింత పుట్టింది. అటువంటి వూహాలు కథల్లో మనుష్యులకేగాని నిజం మనుష్యులకుకూడా కలుగుతవా అనే ప్రశ్నకేం సమాధానం చెప్పగలను?

వరుడు కావాలని ప్రకటించినవారు. తమ చిరునామా కూడా క్రింద పొందు పరచి వరునికి వున్న అతిశయాలు వ్రాసుకుంటూ ఫొటోకూడా పంపమని వుదహరించారు. వాళ్లతో వుత్తర ప్రత్యుత్తరాలు సాగించాలన్న సరదా పుట్టింది. పెళ్లయి బిడ్డల గన్న నాకీగొడవెందు కంటారేమో! ఆ గడియలో పుట్టిన చాపల్యం అంతపని చేయించింది. చివరకదంతా వొక్క కథలాగా నడిచింది.

నా ఆస్తి పాస్తులు చదువు సంధ్యలు అన్నీ వివరంగా వ్రాశాను. అన్నీ నిజమైనవే కాని, పెళ్లయిన సంగతి మాత్రం మరుగుచేశాను. ఫొటో తరువాత పంపిస్తున్నాననీ పిల్ల ఫొటో వుంటే వొక కాపీ పంపవలసిందని వ్రాసి ముగించి కవరులో పెడుతూవుంటే మా సరళ ఏదో ఫల హారం వొక చేత్తో పుచ్చుకుని, వచ్చింది. వుత్తరం సంగతి అడుగుతుందేమో అనుకున్నాగాని ఆ మాటే యెత్తుకో లేదు. నేనైనా చెప్పడం వుండనే వుండదుగా.

## ౨

నా వుత్తరం వెళ్లిన మూడో నాటికి వాళ్ల దగ్గర నుంచి ప్రత్యుత్తరం వచ్చింది. అన్ని విధాల సంబంధం నచ్చినట్లే వ్రాశారు. నన్ను స్వయంగా వచ్చి మాట్లాడ వలసిందిగా ఆహ్వానించారు కూడాను. ఆ పిల్ల ఫొటో కూడా పంపించారు: ఒక పేము కుర్చీలో కూర్చుని చదువుకుంటూ వున్నట్టుంది ఆ చిత్రం. వయసు లేతదనం ముఖంలో ద్యోతక మౌతూవుంది. మనిషి కొంచం బలం గాను పలంగానూ వుంది. ఆకారం మట్టుకు చాలా మనో హరంగా వుంది. పేరు సుధ. 'సుధ' చాలా ముద్దుగా వుంది పేరు. ఆ పేరుతోను ఆ ఆకారం గల వొక సుంద రితోనూ నా భావి జీవితంలో జరిగే మార్పులు వూహించు కుంటూ వున్నాను. సరళ, సుధ, యిద్దరితో నేను నా జీవితం చెందవలసిన పరిణామాలు చాలా విచిత్రంగా కన్పిస్తూ వున్నాయి వూహలకే.

ఆ క్రిందటి రోజునే నా భార్య పిల్ల పుట్టింటికి వెళ్లారు. ఇంకో సమయంలో అయితే అడ్డు పెట్టే వాణ్ణేమోకాని అప్పుడు మారుమాట చెప్పలేదు. నేనే రైలువరకు వెళ్లి సాగనంపి వచ్చాను. "త్వరలోనే వస్తాను. మీరు మాత్రం యీ నాలుగు రోజులకోసం చెయ్యి కాల్చుకో వద్దు. హోటల్ నుండి తెప్పించుకోండి." అంటూ మరీ మరీ నొక్కి చెప్పింది వెళ్లేటప్పుడు సరళ. అన్నిటికీ తల వూపాను. నా మనసంతా వేరే వుంది.


వాళ్ల దగ్గనుంచి వచ్చిన వుత్తరాన్ని యెన్నో సార్లు చదివాను. ఆ ఫొటోను యెన్నో సార్లు చూచాను. ఆ రోజంతా కాలుకాలిన పిల్లిలాగా వుంది నా వ్యాపారం. ఇక ఆ వుత్తరాన్ని పట్టుకు వెళ్లడమా వెళ్లక పోవడమా అనే విషయం కొంతసేపు ఆలోచనకు వచ్చినా చివరకు వెళ్లడానికే నిశ్చయం చేసుకున్నాను. ఇంట్లో సరళ కూడా లేదు. మళ్లీ రెండు మూడు రోజులలో వస్తుంది. వచ్చిన తరువాత వెళ్లడానికి వీలుండవచ్చు వుండకపోవచ్చు. అదంతా యెందుకని మర్నాడుదయం మెయిల్ లో వెళ్లడానికి సిద్ధ పరచుకున్నాను. ఆ నాడు రాత్రి నాకు వచ్చిన స్వప్నా లకు లెక్క లేదు. అన్నీ కాబోయే గృహలక్ష్మి సుధను గురించే. అంతవరకూ నాకదంతా ఒక క్రీడలాగా వుంది. వాళ్లకు రేపుదయాన మెయిల్ లో వస్తున్నట్లు టెలిగ్రాం యిచ్చాను, వాళ్లు స్టేషన్ వద్దకు వచ్చి కలుసుకో వలసిందనికూడా.

ఆరోజు వుదయంనుంచీ చాల హడావుడిగా వున్నా. ఎనిమిదింటికి గాని ప్రక్క దిగని వాణ్ణి ఆ రోజున అయిదింటికే లేచాను! అసలు నా పెళ్ళి నా చిన్నతనం లోనే అయింది. అప్పటికి మా యిద్దరికీ పెళ్లంటే యేమి టో తెలియదని చెప్పవచ్చును. పెద్దల చేతి మీదుగా సల క్షణంగా జరిగిన ఆ పెండ్లి వేరు. ఈ స్వయంవరం వేరు. పిల్లకు నచ్చే విధంగా దుస్తులు వేసుకోవడంలో చాలా కాలం వ్యర్థమైంది. మర్యాదస్తుల పద్ధతిని సన్నని మధుర పంచి బిళ్లగోచీతో కట్టి నలుపు రంగు ఆల్ పాకా లాంకోటు వేయడమా? ఇప్పటి పద్ధతిని పటాపటీ సిల్కు షర్టుమీద రెడ్ బ్లేసర్ కోటువేసి కాలర్ పైకితీసి పంట్లాం వేయడమా? చివరికి అప్-టు-డేట్ గా రెండో పద్ధతే అనుసరించాను. ఆ రోజున బూట్లు విషయంనుంచి పౌడ రక్షలవరకు అంతా ఆలోచించి, అదికాదని యిది, ఇది కాదని అది మార్చి మార్చి నా వేషం తయారు చేసుకున్నా.

ఎంత ఆలస్యం చేసినా సమయానికి స్టేషన్ కు చేరు కున్నాను. బండిలో కూర్చున్నది మొదలు దిగే పర్యం తం, ఆ పిల్లతో యెట్లా మాట్లాడాలో వాళ్లేమేమి అడుగుతారో నేనెట్లా సమాధానం చెప్పాలో అదంతా ఆలోచించుకుంటూ వున్నా. ఇంతలో నా గుబులాట హెచ్చవుతున్నట్లు ఆ స్టేషన్ వచ్చింది.

## 3

వాళ్లు చాలా ధనవంతులు. నా కోసమని కారు పంపించారు స్టేషన్ కు, ఇంటివద్దకూడా యెక్కువగా మర్యాద చేశారు. కాబోయే అల్లునికి మర్యాదలో లోటు



వుంటుందా? నేను వుంటానికి మేడమీద వొక గది యిచ్చారు. వెళ్లడంతోనే ఫలహారం మధ్యాహ్నం భోజనం అన్నీ అయినవి. తరువాత వొక ముసలాయన పిల్ల తండ్రి అనుకుంటా నా మంచీ చెడ్డా అన్నీ తెలుసుకున్నాడు. పిల్లకు రెండువేలు నగలు పెట్టడం అన్నీ స్థిరపరచుకున్నాం. ఇక నేనూ ఆ పిల్లా పరస్పరం చూచుకోవడం మిగిలింది. ఆయన నవ్వుతూ 'ఆగదిలోకి దయ చెయ్యండి!' అని కుడిచేతివైపు గది చూపించాడు. తను మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

గదిలోకి వెళ్లేటప్పటికి నాకు ముచ్చెమట్లు పోసినై. కాళ్లు భూమిమీద తేలిపోతున్నాయి. క్రిందపడి పోతానేమో అన్నంత భయంవేసింది. అంతలో "—కలిసిన సంబంధం భయంలేదురండి!" అంటూ సరళ నాచెయ్యి పుచ్చుకుని సోఫాలో కూర్చోపెట్టింది. సరళను అక్కడచూస్తూ నా కళ్లను నేను నమ్మలేకపోయాను. ఇటువంటి మాయ వుంటుందా అని తెల్లబోయి చూస్తూవుంటే సరళ పొట్ట పగిలేటట్టు నవ్వుతూవుంది. దానికి తోడు సుధ- నేను చూస్తానికి వచ్చిన పిల్లకూడా నవ్వడం మొదలు పెట్టింది హఠాత్తుగా వచ్చి.

వాళ్లు మా ఆవిడ పినతల్లి ఆడబిడ్డ తరఫువారట. ఆ రోజున నేను వ్రాస్తూవున్న వుత్తరం వెనకనుంచి చూస్తూ మా సరళ ఆడింది యీ నాటకమంతానూ.

ఈ సంగతి నాకు దరిమలా తెలిసింది.


# మూలవ్యాధి | చెవుడు

బవాసిర్ సంఘుర్ చిరకాలమునుండియున్న వ్యాధిగాని, క్రొత్తదిగాని, ఎట్టి స్థితిలోయున్నను నొప్పి, జల, మొలలు, మంట బాధలను మొదటి పూటలోనె నివారణజేయును. ఆపరేషన్ లేక 3 రోజులలో సంపూర్ణగుణము. గుణమివ్వనిచో సొమ్ము వాపసు ఇవ్వబడును. వెల రూ. 2

మా "బహిరోదీపన్" తైలము చెవి బాధలకు అమోఘమైనది. చెవుడు చెవిలో నీరు, చీముకారుట, పోటు, దురద, పుండ్లు మొదలగు వాటిని శీఘ్రముగ పోగొట్టును. వేలకొలది చెవిటివారు ఈ ఔషధముచే గుణమొందిరి. గుణమివ్వని యెడల సొమ్ము తిరిగి ఇవ్వబడును. వెల రూ. 2.

శక్తి సుధా కార్యాలయ, కుంబార్‌వాడ 4-వీధి, బొంబాయి, నెం. 4.